సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 16 । మార్చి । 2024



సోమశిలలో 12.71 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 12.71 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 2550 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,680
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,078
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,260
సవర (8 గ్రాములు)	రూ.50,080

గరిష్టం/కనిష్టం
34.5 /25.4

వాతావరణం

గాలిలో తేమ 69 శాతంగా శుక్రవారం నమోదైంది. ఉష్ణోగ్రతల్లో శనివారం పెద్ద మార్పు ఉండబోదని వాతావరణ అధికారులు తెలిపారు.



న్యూస్‌రీల్

మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం



మాట్లాడుతున్న పోతుల సునీత

నెల్లూరు(దర్గామిట్ట): మహిళా సాధికారతకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు పోతుల సునీత పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర, జిల్లా విభాగ సభ్యులతో సమావేశాన్ని పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు మొయిళ్ల గౌరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు అబద్ధాలు, మోసాలను మేనిఫెస్టోతో పొందుపర్చిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. 99 శాతం మేర హామీలను నెరవేర్చి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నే రాష్ట్రానికి అవసరమని చెప్పారు. సంక్షేమ పథకాలతో అందరి అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకంగా చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా.. ప్రతిపక్షాలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా ప్రజాశీస్సులతో తిరిగి అధికారంలోకి వచ్చేది జగనన్నేనని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు విజయలక్ష్మి, అమృత, నేతలు మల్లి నిర్మల, పద్మజాయాదవ్, మొబీనా, లక్ష్మీసునంద తదితరులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్‌తో ఎంతో ప్రయోజనం



ధ్రువీకరణ పత్రాలను అందుకున్న రైతులతో అధికారులు

ముత్తుకూరు: ఈ – క్రాప్ ధ్రువీకరణ పత్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. బ్రహ్మదేవిలో నెల్లూరు ఏడీఈ శ్రీనివాసులుతో కలసి శుక్రవారం ఆమె పర్యటించారు. రైతులకు ఈ – క్రాప్ ధ్రువీకరణ పత్రాలను అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పక ఉండాలని చెప్పారు. బీమా వర్తించేందుకు సైతం ఇవి అవసరమని వివరించారు. బ్రహ్మదేవి పంచాయతీలో 186 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నామని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న తెలిపారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తమ విధులను సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్ నుంచి రిటర్నింగ్, సెక్టోరల్, సెక్టోరల్ పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసేంత వరకు సెక్టోరల్ అధికారులు అత్యంత అప్రమత్తంగా తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈవీఎంల నిర్వహణపై పూర్తి స్థాయి అవగాహన అవసరమని తెలిపారు. ఓటరు స్లిప్పులను బూత్ లెవల్ అధికారుల ద్వారా అందించే బాధ్యత సెక్టోరల్ అధికారులదేనని చెప్పారు. సెక్టోరల్, పోలీస్, ప్రిసైడింగ్ అధికారులు ఏ చిన్న సమస్య ఏర్పడిన ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు తెలిపి తగిన పరిష్కారం పొందాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

నెల్లూరు (టౌన్): ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వినియోదారుల కోర్టు జిల్లా జడ్జి జింకారెడ్డి, సెట్నెల్ సీఈఓ వెంకటయ్య, మేనేజర్ శ్రీనివాసరావు, కళాశాల డీన్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు పదింతలయ్యేలా..

పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల విద్యార్థులు మరింత ఉన్నతంగా రాణించేలా ఆ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సంక్షేమ హాస్టళ్లలో ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునివ్వడంతో పాటు పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్నారు.

సంక్షేమ హాస్టళ్లలో ప్రత్యేక ప్రణాళిక

- ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



స్టడీ అవర్స్ నిర్వహణ తీరుపై తనిఖీలు

నెల్లూరు(వేదాయపాళెం): విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి.. పేదింట విద్యా కుసుమాలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కార్ బడులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు అధునాతన సొబగులను సమకూర్చారు.



నెల్లూరు బీసీ బాలికల హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటయ్య

అధికారుల కసరత్తు

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18న ప్రారంభంకానున్నాయి. ఈ తరుణంలో జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో డివిజన్ల వారీగా ఉన్న వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక ప్రేరణ కార్యక్రమాలను పూర్తి చేశారు. హైస్కూల్ నుంచి హాస్టళ్లకు విద్యార్థులు రాగానే స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల వివరాలను సేకరించి, వారిని ప్రత్యేకంగా చదివిస్తున్నారు.

ట్యూటర్ల నియామకం

ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్టడీ అవర్స్‌ను నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇంగ్లిష్, హిందీ, గణితం, సైన్స్‌లకు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. ఉదయం 6.30 నుంచి 8.30 వరకు.. రాత్రి 8 నుంచి 10.30 వరకు స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. వసతిగృహ సంక్షేమాధికారుల పర్యవేక్షణలో జిల్లా అధికారుల సూచనలతో ట్యూటర్లతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను బోధిస్తున్నారు.

ఇదీ విద్యార్థుల సంఖ్య..

- గతేడాది బీసీ వసతిగృహాల్లో 601 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 72.21 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- ఎస్సీ వసతిగృహాల్లో 477 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 307 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 64.36 శాతంగా నమోదైంది.
- జిల్లాలోని 49 ఎస్సీ వసతిగృహాల్లో 496 మంది.. 58 బీసీ వసతి గృహాల్లో 631 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి చదువుతున్నారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో 1127 మంది ఎస్సీ, బీసీ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. వార్షిక పరీక్షల్లో వీరంతా ఉత్తీర్ణులయ్యేలా హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ఏఎస్‌డబ్ల్యూఓలు, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధం చేస్తున్నారు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..



సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాం. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశాం. టీ, స్నాక్స్‌ను రాత్రి అందిస్తున్నాం.

– హజరత్తయ్య, ఏఎస్‌డబ్ల్యూఓ, నెల్లూరు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నాం. డివిజన్ స్థాయిలో విద్యార్థులకు ప్రేరణ కల్పిస్తున్నాం. వసతిగృహాల్లో రాత్రి వేళ స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నాం. సమ్మేటివ్ – 1, ఎఫ్ – ఏ 4 పరీక్షల్లో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వసతిగృహాల్లో వీరి ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తున్నాం.

– వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి
- నియోజకవర్గాల పరిశీలకులు, కో ఆర్డినేటర్లతో సమావేశం



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, దాని పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల పరిశీలకులు, కో ఆర్డినేటర్లతో నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీలోని ఇతర నేతలతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ పరిశీలకులు, కో ఆర్డినేటర్లపై ఉందన్నారు. ఎన్నికలకు బూత్ కమిటీలు చాలా కీలకమని, ఈ తరుణంలో వివిధ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ మేనిఫెస్టోను పార్లమెంట్ స్థాయిలో తయారు చేసేందుకు సూచనలివ్వాలని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నెల్లో ఫిషింగ్ జెట్టీ పనులు పూర్తి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఫిషింగ్ జెట్టీ పనులను పరిశీలిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు పట్టపుపాళెం సమీపంలో ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులు ఏప్రిల్ 15 నాటికి పూర్తికానున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. సీఎస్సార్ నిధులు రూ.25 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ జెట్టీ పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కార్యాలయ సూచన మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా జెట్టీని నిర్మిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 70 శాతం పనులు జరిగాయని, జెట్టీ పూర్తయిన వెంటనే మత్స్య ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అవసరమైన కోల్డ్ స్టోరేజీ, కార్యాలయం తదితర మౌలిక వసతులను కల్పిస్తామని వెల్లడించారు.

అభివృద్ధిపై సోమిరెడ్డి దాడి

అభివృద్ధి పనుల్లో భాగమైన ఫిషింగ్ జెట్టీని నిర్మిస్తున్న కృష్ణపట్నం పోర్టుపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దాడి చేయడం హేయమైన చర్య అని మంత్రి పేర్కొన్నారు. పోర్టు, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందిపై జరిగిన దాడికి మంత్రి క్షమాపణలు చెప్పారు. సమాజాభివృద్ధికి దోహదపడుతూ.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న ప్రాజెక్టులపై దుష్ప్రచారం, దాడికి పాల్పడితే భావితరాలు క్షమించవని తెలిపారు. ప్రాజెక్టులకు తాము అండగా ఉంటామన్నారు. సర్వేపల్లి టికెట్ రాకపోతే చంద్రబాబును తిట్టాలేగానీ, తనపై పోరాటం చేస్తే ఫలితం ఉండదని తెలిపారు. ఎంపీపీ గండవరం సుగుణ, పార్టీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, పోర్టు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, సర్పంచ్‌లు కనకయ్య, మునుకూరు జనార్దన్‌రెడ్డి, నేతలు శివారెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పల్లంరెడ్డి జనార్దన్‌రెడ్డి, రహీమ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



మాట్లాడుతున్న హరినారాయణన్, పక్కన ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

- కలెక్టర్ హరినారాయణన్
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేలా రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్, పోలీస్ అధికారులతో కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పక పాటిస్తూ.. ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా విధులను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లోకి అభ్యర్థితో పాటు నలుగుర్ని మాత్రమే అనుమతించాలన్నారు. పోలింగ్ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హింసాత్మక ఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

సమర్థంగా పనిచేయాలి

శాంతిభద్రతల నిర్వహణలో డీఎస్పీలు సమర్థంగా పనిచేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ సిబ్బంది పటిష్టంగా పనిచేయాలన్నారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఏఎస్పీ సౌజన్య, డీఆర్వో లవన్న, రిటర్నింగ్ అధికారులు విద్యాధరి, మలోల, శీనానాయక్, మధులత, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ - 1 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- డీఆర్వో లవన్న



మాట్లాడుతున్న లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్ – 1 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో లవన్న ఆదేశించారు. గ్రూప్ – 1 పరీక్షల నిర్వహణపై సమన్వయాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్న పరీక్షల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షలకు 6,954 మంది హాజరుకానున్నారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను కోరారు. ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు అభ్యర్థులకు వీలుగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు చెక్‌లిస్ట్‌ను తయారు చేసి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గ్రూప్ – 1 పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల సందేహాల కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని డీఆర్వో తెలిపారు. సందేహాలుంటే 0861 – 2331261 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఏఎస్పీ సౌజన్య, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు ఆరోగ్యరాణి, సునీత, సమన్వయాధికారులు కన్నమనాయుడు, సుస్మిత, సాంబశివారెడ్డి, సత్యవాణి, నాగరాజు, వెంకట్రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. పరీక్షలు ముగిశాయ్..!



కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. దీంతో పరీక్ష కేంద్రాల నుంచి బయటకొచ్చి విద్యార్థులు కేరింతలు కొట్టారు. గాల్లోకి పేపర్లు విసిరి ఆనందం వ్యక్తం చేశారు. కాగా జనరల్‌కు సంబంధించి 22,319 మందికి గానూ 21,819 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 461 మందికి గానూ 101 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని 43 కేంద్రాలను ఆర్ఐఓ శ్రీనివాసులు, డీవీఈఓ మధుబాబు తదితరులు పరిశీలించారు.

– నెల్లూరు (టౌన్)



సర్వోదయ కళాశాలలో పరీక్ష రాసి బయటకొస్తున్న విద్యార్థులు



క్లుప్తంగా

వృద్ధురాలిని కత్తితో బెదిరించి..

- నగలు దోపిడీ.. ఆలస్యంగా వెలుగులోకి..
- నిందితుడి అరెస్ట్
- 56 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలిని కత్తితో చంపుతామని బెదిరించి నగలు దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడిని శుక్రవారం నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.3.08 లక్షల విలువ చేసే 56 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేట మండలానికి చెందిన కె.శ్రీదేవమ్మ ఈనెల 13వ తేదీన నెల్లూరు పొగతోటలోని ఓ ఆస్పత్రికి వచ్చారు. అక్కడ వైద్యం చేయించుకుని ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేందుకు ఎస్2 థియేటర్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని దుండగుడు ఆమెను కత్తితో చంపుతామని బెదిరించి 53 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. దీంతో బాధితురాలు ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన కుటుంబసభ్యులకు తెలియజేసింది. వారి సహకారంతో ఈనెల 14వ తేదీన ఆమె దోపిడీ ఘటనపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై ఎల్.సుధీర్‌కుమార్ కేసు నమోదు చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ ఎస్సై, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. శ్రీదేవమ్మ చికిత్స చేయించుకున్న ఆస్పత్రి వద్ద నుంచి దోపిడీ జరిగిన ప్రదేశం వరకు ఉన్న సీసీ కెమెరా పుటేజీను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితుడు నాయుడుపేట మండలం తుమ్మూరు గ్రామానికి చెందిన గిరిబాబుగా గుర్తించి అతడి కోసం గాలించారు. శుక్రవారం నిందితుడిని నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బందిని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

పెంచలయ్యపై చర్యలు తీసుకోవాలి

- ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌కు పీఓ ఫిర్యాదు

నెల్లూరు(వేదాయపాళెం): సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూపుల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఇబ్బంది పెడుతున్న గిరిజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ మందా రాణి కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళికి ఫిర్యాదు చేశారు. అందులోని వివరాలు.. గతంలో పెంచలయ్య ఎస్ఎస్‌టీఎఫ్‌డీసీలో కారును సబ్సిడీ కింద పొందారు. అయితే టర్మ్ లోన్ తిరిగి చెల్లించలేదు. ఫలితంగా కారును స్వాధీనం చేసుకున్నాం. అప్పటి నుంచి వాట్సప్ గ్రూపుల్లో నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నన్ను ఇబ్బంది పెడుతున్నాడు. అందువల్ల ఆయనపై క్రిమినల్ కేసులు దాఖలు చేయడానికి అనుమతించాలని కోరారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి:	రూ.85
సన్నవి:	రూ.75
పండ్లు:	రూ.30

నెల్లూరు పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	128
లేయర్ (లైవ్):	73
బ్రాయిలర్ చికెన్:	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	254
లేయర్ చికెన్:	125

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - అటవీశాఖ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు డివిజను

ఆర్.సి.నెం.147/2017 **షార్ట్ టెండరు నోటీసు** తేది: 14.03.2024

అటవీశాఖ, నెల్లూరు డివిజను పరిధిలోని ఉదయగిరి అటవీ క్షేత్రము నందు **పోరుమామిళ్ళ నుండి సి.యస్.పురం వరకు** భారత జాతీయ రహదారుల సంస్థ వారు **167-బి జాతీయ రహదారి విస్తరణ నిమిత్తం** యస్.ఆర్.పురం రఫ్ నందు బదలాయించిన **5.94 Ha** ల అటవీ భూమిలో సేకరించిన **కలపను కొనుగోలు చేయుటకు** ఆసక్తి గల కాంట్రాక్టర్లు **తేది: 21.03.2024** న ఉదయగిరి అటవీక్షేత్రము వారి కార్యాలయము నందు వేలం పాట నిర్వహించెదరు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు క్రింద చూపబడిన కలపను పాడుటకు వేలం పాటలో పాల్గొనుటకు కోరడమైనది.

Date of sale Proposed	Description of Produce	Quantity
21.03.2024	నానా జాతి వంట చెరకు మరియు టింబర్	నానా జాతి వంట చెరకు 270.45cmt టింబర్ 20 cmt

వేలం పాట షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనుటకు **ధరావత్తు సొమ్ము రూ.1000/-లు** (ఒక వేయి రూపాయలు మాత్రమే) మరియు **జీఎస్‌టీ రూ.180/-** ఉదయగిరి అటవీ క్షేత్రము కార్యాలయము నందు కట్టి వేలం పాటలో పాల్గొనవలెను. **వేలంపాట నిర్వహించు తేది: 21.03.2024 ఉదయం 10.00 గంటలకు.**
సం/- తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, అటవీ క్షేత్రాధికారి, ఉదయగిరి.

గ్రామాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆదాల, అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి

- నెల్లూరు ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఐదేళ్ల పదవీ కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో శుక్రవారం ఆయన, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి పర్యటించారు. రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ.8 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ, రూ.58 లక్షలతో నిర్మించిన సైడు కాలువలు, సీసీ రోడ్లు, రూ.26 లక్షలతో బీసీ బాలుర హాస్టల్లో చేపట్టిన పనులు, రూ.5 లక్షల నిధులతో దళితవాడలో కట్టిన మండపం, రూ.5 లక్షలతో ఓసీ కమ్యూనిటీకి సంబంధించిన మండపం, మొగళ్లపాళెం గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీ, సీసీ రోడ్లు తదితర వాటికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గడిచిన పదినెలల కాలంలోనే సౌత్‌మోపూరులో రూ.2 కోట్లకు పైగా నిధులతో వివిధ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయకుమార్, నాయకులు బండ్ల రాజేంద్రప్రసాద్, కరీంబాషా, ఎస్కే మస్తాన్ సాహెబ్, జానా మస్తానయ్య, దొడ్డిక మురళి, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జై కొట్టండి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎమ్మెల్యే మేకపాటిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

సంగం: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆయన పాలనకు అందరూ జై కొట్టాలి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెరమన, జంగాలదొరువు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే విజయీభవ యాత్రను నిర్వహించారు. పెరమనలో పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విక్రమ్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఏకమై వస్తున్నాయని, ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రతి పేద కుటుంబానికి తమ ప్రభుత్వం సాయం చేసిందన్నారు. గ్రామాలను అభివృద్ధిపథంలో నడిపించామని, ఆ ధైర్యంతోనే మీ కుటుంబానికి మంచి జరిగితేనే నాకు ఓటెయ్యండని అడుగుతున్నామన్నారు. పెరమన, జంగాలదొరువు గ్రామాల్లో డీబీటీ, నాన్‌డీబీటీ కింద ఇప్పటి వరకు రూ.11.91 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. సంక్షేమాన్ని అందుకున్న ప్రతి ఒక్కరూ స్టార్ క్యాంపెయినర్లుగా మారి ప్రచార బాధ్యతలను చేపట్టాలన్నారు. సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే జగనన్నను గెలిపించాలని అందరికీ చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మీప్రసాద్‌గౌడ్, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దేవసహాయం, మాజీ ఎంపీపీ దగుమాటి కామాక్షమ్మ, నేతలు దగుమాటి మధుసూదన్‌రెడ్డి, కమతం కృష్ణారెడ్డి, బసిరెడ్డి, ముడి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వింజమూరును అభివృద్ధి చేస్తా



డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసిన రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రజా వైద్యశాల నుంచి ఆంజనేయస్వామి గుడి, పాతూరు, కోమటి బజారు వరకు రూ.90 లక్షల వ్యయంతో డ్రెయినేజీ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి వింజమూరు మండలం కంచుకోట అన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుతో పాటు వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం చేపట్టిన డ్రెయినేజీ పనులకు ఉపాధి హామీ, మండల ప్రజాపరిషత్, పంచాయతీ నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, మద్దూరు బాబు, రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ సుజన, షేక్ అలీఅహ్మద్, మద్దూరు గోపాల్‌రెడ్డి, అంకినపల్లి నారసింహారెడ్డి, గంగాధరరెడ్డి, రఘురామిరెడ్డి, మిడదాల రాజారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐస్ ఫ్యాక్టరీలో దోపిడీ

కోవూరు: కోవూరులోని జాతీయ రహదారిపై ఉన్న ఎస్‌కేఎం ఐస్ ఫ్యాక్టరీలో గురువారం అర్ధరాత్రి దోపిడీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఫ్యాక్టరీ వద్దకు వచ్చారు. ఒకరు బయట ఆటో పెట్టుకుని ఉన్నారు. మరో ఇద్దరు లోనికి వెళ్లి వాచ్‌మెన్ రమణయ్యను కర్రకు కట్టేసి అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కారు. రూ.50 వేల విలువ చేసే టైర్ల రిమ్ములను దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ యాజమాని మస్తాన్ శుక్రవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించారు.

చిన్నారులకు ఎన్ఎస్సార్ ట్రస్ట్ చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఎన్ఎస్సార్ ట్రస్ట్ చేయూత అందించింది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం జొన్నవాడలో పర్యటించారు. చిన్నారులు ముద్దా విగాష్, ముద్దా ఈశ్వరమ్మ, టి.హేమంత్, సాయి, టి.జైవిత్, కె.రూప పేరిట రూ.10 వేలు చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఏఏకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీఏఏకు (పౌరసత్వ సవరణ చట్టం) వ్యతిరేకంగా శుక్రవారం వామపక్షాలు, ప్రజాసంఘాలు నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేశాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ చట్టాన్ని కేంద్రం వెనక్కు తీసుకునే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ మత రాజకీయాలను చేస్తోందని దుయ్యబట్టారు. ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరాజ్, ఎల్లంకి వెంకటేశ్వర్లు, సయ్యద్ సమీ, మాదాల వెంకటేశ్వర్లు, ఎలీషా, కత్తి శ్రీనివాసులు, కృష్ణయ్య, రషీద్, నాగేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

కిలో పొగాకు గరిష్ట ధర రూ.230

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.230 ధర లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 332 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 317 బేళ్లను కొనుగోలు చేశారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు కనిష్టంగా రూ.230, సరాసరి రూ.230 ధర లభించిందన్నారు. వేలంలో 12 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో..

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 316 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో 42,248 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.97,17,155ల వ్యాపారం జరిగిందన్నారు. గరిష్టంగా కిలోకు రూ.230 ధర లభించిందని, 13 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని వెల్లడించారు.

ఆశీర్వదించండి

మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి



రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి శుక్రవారం నెల్లూరులోని 14వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ తదితరులతో కలిసి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. – నెల్లూరు



కరపత్రం అందజేస్తున్న విజయసాయిరెడ్డి